# హోటల్ రాజు కథ

"అతని గొడవ మనూరోళ్ళకి చెప్పున్నావేంటి..ఇంతకు ముందెప్పుడన్నా చూసేవా ఆ మనిషిని?" అడిగేరు మిల్లు సత్తిరాజుగారు.

"నిన్న వెదురుపాకసావరంలో పెళ్ళికొస్తే ఎవరో చూపించేవు" అన్నాడు కర్రికిష్ణగారు.

"అంత గొప్పోడా ఆ మనిషి??" అన్న సత్తిరాజుగారి ప్రశ్నకి "కాస్సేపాలకించ గూడదూ అర్థమవుద్ది" అని మొదలెట్టేడు క్రిష్ణ——

ఎప్పుడూ గోదావరినీళ్ళతో పచ్చగా కళకళలాడే ప్రాంతాన్ని డెల్టా అనీ, ఏటి నీళ్ళతో పంటలు పండే ప్రాంతాన్ని పోలినాడు అనీ కేవలం వర్షాధారంతో పంటలుపండే ప్రాంతాన్ని చాగల్నాడు అని పిలుస్తారంట ఈ తూర్పుగోదావరి జిల్లాలో.

పాతపెద్దాపురం, కాండ్రకోట, మర్లావలాంటి ప్రాంతాల్ని పోలినాడు ప్రాంతమనే పిలుస్తారు. సరిగ్గా ఆ పోలినాడులోనే ఉంది "గుడిలోవ" అనే ఊరు.

ఎర్రకంకరబాటకి ఎడాపెడా నేల చెరుకుతోటల్తో నిండిపోయుంది. అక్కడక్కడా కోసేసిన వరిచేల గట్లమీద కందిమొక్కలు పెరుగుతున్నాయి. కొన్ని కొన్ని చోట్ల పెరిగిన పెండలం తోటలు... కొన్ని వాడపిల్లి పెంకుటిళ్ళ వెనక పంపర పనాసచెట్లు. అందమైన ఊరు గుడిలోవ. పెద్ద రచ్చబండ, దాని పక్కనే పెద్ద నిద్రగన్నేరు చెట్టు, ఆంజనేయ స్వామి గుడి. వీటన్నిటినీ జేర్చి ఏరు. దాని అవతల పచ్చటితోటల మధ్య కనిపించీ కనిపించనట్టు ఇంకో ఊరు. పచ్చపచ్చటి అందమంతా అక్కడే వుంది. ఏటి ఒడ్డునున్న రావిచెట్టుని జేర్చిఉన్న చిన్న కాఫీహోటేలుపాక రాజుది.

కోడిగుడ్డు కలిపి పెసరట్టెయ్యడంలో ఫేమస్సయిన అతన్ని కోడిగుడ్ల పెసరట్టురాజు అనీ హోటలురాజూ ఒట్టిరాజు అనీ ఊళ్ళోవాళ్ళు పిలిస్తే ఎగువ కొంపలోళ్ళు దిగువకొంపలోళ్ళూ మూలకొంపలోళ్ళు హోటలు రాజబాబుగారనీ, సిరిగినీడి రాజబాబుగారనీ పిలుస్తారు. అయితే అతని హోటేలుకి వచ్చేది ఈ కొంపల్లో వాళ్ళే. ఊళ్ళోవాళ్ళకి హోటలుకొచ్చి తినడం నామర్దా.

రాజు హోటలుకొచ్చి తినేసి పోయే జనాల్లో సగానికి పైగా అరువులెట్టి పోయేవాళ్ళే. ఆ అరువులకి కూడా లెక్కాపత్రం ఉండవు. తినేసినోడు డబ్బులిస్తే నవ్వుతా డ్రాయరు సొరుగులో వేసుకుంటాడు. లేవండి తర్వాతిస్తానంటే నవ్వేస్తా "సర్లేరా మావా" అంటాడు. ఎవరికీ ఏనాడు దేనికీ లేదనడు కాదనడు. దాంతో జనాల్లో చాలా పేరెల్లిపోయిన రాజు ఇప్పటికి నాలుగుసార్లు దివాళా తీసాడు.

పిఠాపురంనించి అప్పులిచ్చే తాతాలు అనే మనిషెవరో ఉంటే అక్కడ్నించి తెస్తా మళ్ళా హోటలు తెరుస్తున్న రాజుతో ఈసార్నుంచన్నా డబ్బుల విషయంలో చాలా జాగర్తగా కరాకండీగా ఉండాలని తాతాలంటే తోళుం నవ్వేసి అలాగేనండి అంటాడుగానీ మామూలే. హోటలు మూసేసేకా తన చింతపిక్కరంగు డొక్కు మోపెడ్ బండేసుకుని ఎదురైే నోళ్లని వరసలు పెట్టి పిలుస్తా ముందుకెళ్తా ఉంటాడు. ఆ వూళ్ళోనే గాకుండా మడిలోవ, గోవాడ, సిరివాడ, చంద్రమాంపల్లికూడా తిరుగుతా ఎవరికే సాయం గావాలన్నా చేసి పెడతా ఉంటాడు. దాంతో ఊరి లేబరుతో పాటు చుట్టుపక్కలూళ్ళ జనంకూడా "రాజబాబూ నువ్వు ఏ జన్మలోనో ఏదేశానికో మారాజువై ఉంటావ్" అని పొగుడ్తుంటారు హోటలురాజుని.

రాజు వాలకం జూస్తున్న ఊళ్ళో పెద్దోళ్ళు కొందరు "ఈడు ఒట్టి వెర్రి బాగులెదవ" అనుకునేవారు. అంత తెలిగ్గా నోరు విప్పని ఇంకొందరయితే "ఈడిలా ఎందుకు నడుచు కుంటున్నాడూ... దేనికి ఆశపడి అప్పనంగా ఈ పన్లన్నీ చేస్తున్నాడు" అనేసి రాజునే గమనిస్తా కూపీలాగే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నాళ్ళకి అర్థమైందేంటంటే రాజు దేనికీ ఆశపడి ఏపనీ చెయ్యడం లేదని మంచితనంతోటే ఉపకారాలు చేస్తున్నాడని తెలింది.

ఒకసారి తెగులొచ్చిన రాజు సామర్లకోట ఆస్పత్రిలో జెవితే పలకరించడానికి గుడిలోవ జనంతోపాటు చుట్టుపక్కల వూళ్ళ జనంకూడా






దిగిపోయేరు.ఆ హోటలురాజుగాడ్నింతమంది ఇష్టపడతారా అని విస్తుపోయేరు గుడిలోప వూరి జనాభా.

* * *

పిడకలు సర్దిఉన్న సిరిగినీడి గాంధీరావుగారి పెరట్లో ఉన్న నిట్రాళ్ళ పాకని పచ్చటి కాకరపాదు పూర్తిగా కమ్మేసి పసుపు పచ్చటిపూలు పూస్తుంది. పచ్చటితోటల మధ్యఉన్న బండారు తిరపతిరావుగారి తెల్లటి సవాధి గ్రామదేవత గుడిలాగుంది. కొబ్బరితోటల మధ్య పండించిన వరిచేను కోసి పనలేస్తున్నారు జనం. గోచీపాతతో ఉన్న ముసలోడు ఎడం భుజం మీద గేలం ఊచలు పెట్టుకుని కుడిచేత్తో చేపలసరం పట్టుకుని ఏటిపాయ మధ్య ఇసకలో నడుచుకుంటా పోతున్నాడు. ఏరుదాటుతున్న ఎడ్లబళ్ళకేసి చూస్తా నడుస్తున్న రాజు జబ్బమీద వీసెగుద్దు పడింది. ఎవడా అని చూస్తే సైకిలుషాపు రవణగాడు. "సర్పంచి ఎలక్షన్లొస్తున్నాయి



గందా... నువ్వెందుకు పోటీ చెయ్యకూడదూ'' అన్నాడు రవణ. వాడి మాట ఏమాత్రం అర్థంగాక ''ఏంటీ అంటన్నావ్?'' అన్నాడు రాజు.

అన్నమాటే మళ్ళీ అన్నాడు రవణ.

అవాక్కయిపోయిన రాజు ''ఏంట్రా నీ పేలాపన?'' అన్నాడు.

''నీ గురించి నీకు తెలీదబ్బాయ్'' అన్నాడు రవణ.

''ఏంట్రా ఈడి వాగుడు?'' అన్నాడు అప్పుడే వచ్చిన మిత్రులతో.

''రవణగాడన్నది నిజమే నీ గురించి నీకు తెలీదు'' అన్నాడు కిళ్ళీకొట్టు గోవిందు.

''అసలు నేను సర్పంచికి పోటీ ఏంట్రా???''

''ఏడ్చేవులే...జనంలో నీకు చాలా మంచి పేరుంది గదరా బావా'' అన్నాడు సీవండి గిన్నెలు సైకిలుకి కట్టుకెళ్ళి ఇన్‌స్టాల్‌మెంట్స్ మీద అమ్మే చిట్టి ''నీలాగ దానం జేసేగుణం ఎంతమంది కుంది జెప్పు... మాకయితే లేదు'' అన్నాడు బట్టలమూట సుబ్బరాజు.

ఏటిమధ్యలో చీకటిపడ్తున్న ఆ శీతాకాలం సాయంత్రం పూట ఇలాగ అందరూ తలో మాటా అన్నాక ఆఖర్లో ''ఊరుకోండెహె..అసలు నేను సర్పంచేంటి?'' అనేసెళ్ళిపోయేడు రాజు.

ఇక అక్కడ్నించి హోటలు రాజు ఎప్పుడు ఎదురైనా బాలభక్తసమాజంలో పిల్లల భజనపాటలాగ అదేముక్క అనడం మొదలెట్టేరు. వీళ్లతో పాటు పేటల్లో జనమంతా ఇంటి ముందు జేరి నువ్వు ఎలక్షనులో పోటీ జేసి తీరాలని మొండికేసి కూర్చున్నారు. ఇక ఎవరినోట్లోంచొచ్చినా ఇదే ముక్క ''నువ్వు ఎలక్షనులో పోటీజేసి తీరాలి''.

రెండు రోజులపాటు ఆలోచించుకున్న రాజు ''ఎన్నేళ్లనించో ఎలాంటి పోటీ లేకుండా ఊర్నేలుతున్న కారపు శివరామక్రిష్ణమాయ్యగారితో పోటీ చెయ్యడమేంటీ?'' అన్నాడు మళ్ళీ.

''ఎందుకు చెయ్యగూడదు పోటీ, ఏంటీ నాన్చుడుబేరం ముందు ఒప్పుకుంటావా లేదా'' అనేసి కూర్చున్నారు.

''మరి ఖర్చుపెట్టడానికి నా దగ్గర సత్తుబేడలేదు'' అన్నాడు రాజు.

ఆ ముక్క విన్న వూరి కూలోళ్ళు... చుట్టుపక్కల ఊళ్ళకూలోళ్ళంతా గల్సి ఒకరోజు కూలీ విరాళం ఇచ్చేరు. ఇంతకు ముందు తన సాయం పొందినోళ్ళంతా ఎంతోకొంత తీసుకొచ్చి చేతిలో పెట్టేరు. పేటపేటకీ హోటలురాజుని తిప్పి ప్రచారం చేసేరు.

అంతా ఓట్లకోసం డబ్బులు పంచిపెడ్తుంటే ఈవూళ్ళో డబ్బులు ఎదురిచ్చి రాజుని బంపర్‌మెజార్టీతో సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అలాగ సర్పంచిగా గెలిచిన హోటలురాజుని ట్రక్టరు తొట్టిలో ఎక్కించి మెళ్ళో రూపాయినోట్ల దండేసి అదేదో సినేమాలో రాజువయ్యా మహరాజువయ్యా అనే పాటేసి ఊరంతా ఊరేగించి ప్రతివీధిలోనూ దిష్టితీసి హారతులిచ్చేరు. రాములోరిగుళ్ళో భజన్లు చేసేరు.

చిత్తుగా ఓడిపోయిన కారపు శివరామకృష్ణ ఆవేళ రాత్రి రాజుని రమ్మనిజెప్పి వేటపలావూ, టైగర్‌రెయ్యల వేపుడుతో భోజనం పెట్టేక వాకిట్లో తను కూర్చున్న నవారు మంచం పక్కన రాజుని కూర్చోబెట్టుకుని ''చాలా ఏళ్ళ నించి ఈ వూరిని ఏల్తున్న నన్ను ఓడించేవురా అబ్బాయ్... శభాష్'' అన్నాడు.

''క్షమించండి మాయ్యగారూ... పేటల్లో పాటకపు జనవంతా నిలబడమంటే నిలబడ్డానంతే'' అనేసి తలొంచుకున్నాడు రాజు.

''లేదురా నా పరిపాలన జూసి జనానికి ఇకార మొత్తిందని నీకుపడ్డ ఓట్లు జూసేకా అర్థవయిపోయింది..మరిక నా కోరికేంటంటే కాలం చెల్లిపోయిన నా అవసరం ఈ జనానికి ఈ జన్మకి అక్కర్లేకుండా నువ్వు ఏలాలి ఈ ఊర్ని. నీ వెనకాలుండి నీకు ఎలాంటి సాయం చెయ్యడానికన్నా నేను సిద్ధం'' అన్నాడు.

ఒంగి శివరామకృష్ణ కాళ్ళకి దణ్ణమెట్టిన హోటలురాజుని ''తప్పారే'' అంటా లేపి ''చెప్పేను గదా నే చెప్పినట్టు చెయ్యి. ఎప్పుడూ పోటీ అంటే ఏంటో ఎరగని నేను వచ్చేసారి కూడా పోటీ చేస్తాను. నువ్వు మట్టుకి ఇలాగే ఎక్కువ మెజార్టీతో గెలవాలి... అర్థమైందా నాన్నా?'' అని హరికెన్‌లాంతరు పట్టుకుని వీధి చివరిదాకా సాగనంపేడు.

* * *

గుడిలోవ గ్రామపంచాయితీ ఆఫీసులోపలికొచ్చిన హోటలురాజు ఏటి పాయని ఆన్చి స్మశానం దగ్గర్లో ఉన్న పదెకరాల జాగాలో మాజీ సర్పంచి కారపు శివరామకృష్ణగారు చెరుకేసేరు. వెంటనే ఆ భూమి పేదవాళ్ళకి పంచాలి. ఊరిశివార్లో ఉన్న చాకలి చెరువుని మూయించిన మాజీ సర్పంచిగారి బంధువు చెరుకుగానుగ పాకలేసేడు. అది వెంటనే అప్పగించాలి... ఇలాంటి చాలా ఆర్డర్లేసేడు రాజు. దేనికీ రాజు మీద కత్తి గట్టడం లేదు. అతనేం చేస్తున్నా చాలా సబబుగా ఉంటుందని ఒప్పుకుంటున్నారు.

ఇలాగ ముందు కెళ్తున్న సర్పంచి రాజు ఒక్క గుడిలోవేగాకుండా ఆ చుట్టు పక్కల ఊళ్ళకి కూడా ఆదర్శంగా నిల్చి పోయేడు. గుడిలోవ సర్పంచి రాజుని జూసి నేర్చుకోండి. ఎవరికి ఎలాంటి గొడవొచ్చినా చక్కదిద్దుతున్నాడు. ఎవడికి ఏ బాధొచ్చినా ఎదురెళ్తున్నాడు. హాస్పిటళ్ళకి తిప్పుతున్నాడు. కింద కులపోళ్ళలోన్లు ఇప్పిస్తున్నాడు గుడిలోవ గ్రామాన్ని ఆదర్శంగా దిద్దుతున్నాడు. అనేసి ఎమ్మెల్యేగారు మిగతా సర్పంచిలకి కబుర్లు చేస్తున్నాడు.

* * *

ఆ రోజు గురుపౌర్ణమి. ఊర్ని ఆనుకుని ప్రవహిస్తున్న ఏటినిండా ఆ ఏటవతల తోటల్నిండా ముఖ్యంగా గుడిలోవ ఊర్నిండా ఒకటే వెన్నెల. శీతాకాలం చలిగాలి సుళ్ళు తిరుగుతా గుర్లు గుర్లని చప్పుడు చేస్తుంది. చలిని తట్టుకోలేని ఊరిజనం తలుపులు బిగించుకు పడుకున్నారు. ఎక్కడా చిన్న ఇళాయిబుడ్డి వెలుగుకూడా కనపడ్డం లేదు. దూరంగా చెరుకుతోటల మధ్య బెల్లం వండుతున్నారు. కమ్మటి వాసన గాల్తో పాటు కల్సి వూళ్ళోకొస్తోంది. వాళ్ళింటికి భోజనానికి పిల్చిన సలాది వెంకట్రావు చివర్లో సాగనంపేటప్పుడు వాళ్ళ దూరపు బంధువుల పిల్ల దుర్గాభవానీని చూపించి ''చేసుకుంటావా?'' అన్నాడు.

''సరే'' అన్నాడు రాజు.

మంచి ముహూర్తం చూసి అన్నవరం సత్యన్నారాయణమూర్తి గుళ్ళో పెళ్ళి జరిపించేసేడు వెంకట్రావు.

అలా కొన్నాళ్ళకి దుర్గాభవానీకి ఆడపిల్ల పుడితే జయ అని పేరెట్టేడు.

రాత్రుళ్ళు పగళ్ళు వారాలూ నెలలూ గడుస్తున్నాయి. ఊర్ని మాగొప్పగా పాలిస్తున్న రాజు తన హోటలు వ్యాపారం మానలేదు. పాతపెద్దాపురంలో ఉండేవాళ్ళక్క కొడుకు ఆదిగాడ్ని పిల్చి హోటలు నడిపేపని వాడికప్పగించి వచ్చిన ఆదాయంలో నాలుగోవంతు తను తీసుకుని దాన్ని దుర్గాభవానీకిచ్చి ఇల్లు గడప మంటున్నాడు. ఆ బొటాబొటీ ఆదాయంతో చాలీచాలక అవస్థపడ్తున్న దుర్గాభవానీని చూసిన సైకిలు షాపు రవణ ఒకరోజు హోటలురాజు దగ్గరకొచ్చి''ఇదేంట్రా ఒక్క రూపాయి వెనకెయ్యడం లేదు... రేపన్ననాడు పెరిగి పెద్దదవుతున్న ఆ పిల్ల భవిష్యత్తు ఏం గావాలి చెప్పు?'' అన్నాడు.

నవ్వేసిన రాజు ''సాయిబాబు గుడికివ్వేళ శంఖుస్థాపన'' అని జెప్పేసి ఊళ్ళోకెళ్ళిపోయేడు.

జయకి మూడేళ్ళు దాటినియ్యి.

కిళ్ళీకొట్టు గోవిందుకీ బట్టలమూట సుబ్బరాజుకూడా తనతో ఇదే మాటాడ్డం మొదలెట్టేరు.

''మొత్తం ఊరి సొమ్ము దోచెయ్యమనడం లేదు. ఏదో కాస్తో కూస్తో వెనకేసుకోవచ్చు గదా తప్పులేదొరే?'' అన్నాడు రవణగాడు.

''అందరూ జేసే పనే ఇది... తప్పుకాదురా'' అన్నాడు సీవండి గిన్నెల చిట్టి.

ఇలా అంతా తలోమాటా అంటుంటే రాజుకూడా కొంచెం ఆలోచించడం మొదలెట్టేడు.

* * *

అలాగ చాన్నాళ్ళపాటు ఆలోచించిన హొటలు రాజు ఆవేళ పొద్దుటే జయతో గోడకున్న సరస్వతీదేవి పొటోకి దండేయించాకా భార్యని పిలిచి ''ఇంతమంది జనం ఇన్ని రకాలుగా చెపుతుంటే నాలోనూ మార్పొచ్చింది. నేనూ అవినీతికి పాల్పడుతున్నాను. రేపన్నానాడు ఈ పిల్ల భవిష్యత్తు ఏమయిపోద్దని గదానీ బెంగ అయితే చాన్నాళ్ళనించి చాలా బాగా ఆలోచించుకుని ఇవ్వేళ ఈ పిల్లని తీసుకెళ్తన్నాను'' అన్నాడు.

''ఎక్కడికి?'' ఆదుర్దాగా అడిగింది దుర్గాభవానీ.

''పాకీ వాళ్ళకి మన జయని దత్తత ఇస్తున్నాను''అన్నాడు.

మతిపోయినట్టు చూస్తా ''ఎందుకు?'' అంది.

''ఈ పిల్లని ఆళ్ళకి దత్తత ఇస్తే ఆళ్ళు ఎస్.సి.లు గాబట్టి ఆళ్ల పిల్లలకి మంచి మంచి ఉజ్జోగాలు వస్తయ్యిగదా? పిల్ల భవిష్యత్తు బాగుంటదిగదా అదే గదా నువ్వు కోరుకుంటున్నది?'' అన్నాడు రాజు.

నోటిమాట పడిపోయింది దుర్గాభవానికి.

''నాదృష్టిలో ఇదే చాలా స్వార్థపుపని ఇంతకుమించి అవినీతిపని నేను చెయ్యలేనుగాక చెయ్యలేను'' అనేసాడు రాజు.

కూతురు జయతో తనకి దణ్ణవెట్టిస్తుంటే శిరసొంచిన తను తన పెనిమిటికి దణ్ణవెట్టుకుంది దుర్గాభవానీ.

* * *